క్లుప్తంగా

'అన్న క్యాంటీన్' తనిఖీ



క్యాంటీన్ వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల: పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సముదాయంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆహార పదార్థాలు ఇస్తున్నారా? ఉదయం అల్పాహారానికి ఎంత మంది వస్తున్నారు.. మధ్యాహ్న, రాత్రి భోజనాలకు ఎంతమంది పేదలు వస్తున్నారన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వడ్డించాలని సూచించారు. అలాగే క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ: యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వ్యవసాయ పనిముట్లకు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ సునీత రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులతో సమావేశమై బ్యాటరీ స్ప్రేయర్ 9 యూనిట్లు, పవర్ స్ప్రేయర్లు 22, ట్రాక్టర్ పనిముట్లు 28 యూనిట్లు, రోటావేటర్ 1, గడ్డి కోత యంత్రం 1 యూనిట్ మంజూరయ్యాయన్నారు. వీటి కోసం ప్రభుత్వం మండలానికి రూ. 10.42 లక్షలు కేటాయించిందన్నారు. మార్చి 31వ తేదీలోగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో వీఏఏల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ సరళ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



చెత్త సంపదపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: చెత్త నుంచి గ్రామాల్లో సంపద సృష్టించాలని ఈఓఆర్డీ నాగ అనసూయ అన్నారు. మంగళవారం మండలంలోని దీబగుంట్ల గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టు యూనిట్ వద్ద పంచాయతీ కార్యదర్శులకు, హరిత రాయబారులకు హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేయటం గురించి వివరించారు. చెత్త నుంచి సంపదను ఏ విధంగా సృష్టించాలో తెలియజేశారు. దీబగుంట్ల ఎస్ డబ్ల్యు పీసీ షెడ్డును లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఏర్పాటు చేశారు.

తెలుగును ద్వితీయ భాషగా తప్పనిసరి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్‌లో తెలుగును ద్వితీయభాషగా తప్పనిసరి చేయాలని ప్రముఖ తెలుగు రచయిత ప్రసాద్, సూరన సాహితి సంఘం నాయకులు మద్దిలేటి అన్నారు. మంగళవారం ఇంటర్మీడియట్ స్పాట్ క్యాంప్ కార్యాలయంలో క్యాంపు అధికారి సునీతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటర్ విద్య సంస్కరణలో భాగంగా తప్పనిసరిగా చదవాల్సిన ద్వితీయ భాష తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చితే భవిష్యత్తులో తెలుగు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబాదేవికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడిబియ్యం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు పాల్గొన్నారు.

ఆటో, మోటార్ సైకిల్ ఢీ



గాయపడిన నరసింహులు

చాగలమర్రి: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చాగలమర్రి నుంచి నారాయణపల్లె గ్రామానికి వెళుతుండగా బుగ్గవంక సమీపంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నారాయణపల్లె గ్రామానికి చెందిన నరసింహుడు బైక్‌పై చాగలమర్రికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అటువైపు నుంచి మినరల్ వాటర్ సరఫరా చేసే ఆటో వస్తుంది. బుగ్గవంక సమీపంలోని క్రాస్ వద్ద ఆ రెండు వాహనాలు ఢీ కొన్నాయి. తీవ్రంగా గాయపడిన ద్విచక్రవాహనదారుడు నరసింహులును కేరళ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువికా.. అంతరిక్ష కలల వేదిక!

ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన కార్యక్రమం-2025

- భావిభారత శాస్త్రవేత్తల తయారీకి చక్కటి అవకాశం
- ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు
- 9వ తరగతి విద్యార్థులు అర్హులు

విద్యార్థి దశలోనే ప్రతిభ గల చిన్నారులను గుర్తించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చడమే లక్ష్యంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అడుగులు వేస్తోంది. ఇందుకు అంతరిక్ష సాంకేతికత, పరిజ్ఞానం, అనువర్తనాలపై అవగాహన కల్పించి వారిలో స్ఫూర్తి నింపేందుకు ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టే కార్యక్రమానికి తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో పాల్గొనే విద్యార్థులకు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కూడా కల్పిస్తుంది.



చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి చూపి ఎందరో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. అటువంటి విద్యార్థులు జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుస్తున్నారు. వారి కోసం ఇస్రో ప్రత్యేకంగా యువ విజ్ఞాన కార్యక్రమాన్ని 'యువికా' పేరుతో నిర్వహిస్తోంది. 2024- 25 విద్యా సంవత్సరంలో ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇస్రో.జీవోవీ.ఇన్‌లో మార్చి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. వచ్చిన దరఖాస్తుల నుంచి ఏప్రిల్ 7న మొదటి విడత ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

అర్హతలివీ..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు యువికా-2025 దరఖాస్తుకు అర్హులు. 8వ తరగతి పూర్తి చేసి, ప్రస్తుతం 2024-25 విద్యాసంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే దరఖాస్తుకు అవకాశముంది. విద్యార్థి విద్యాభ్యాస కాలంలో చూపించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాష్ట్ర సిలబస్, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.

ఎంపిక పద్ధతి...

8వ తరగతిలో పొందిన మార్కులు (50 శాతం), మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర/జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటే (2/5/10శాతం), ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు (10శాతం), ఒలింపియాడ్‌లో పాల్గొని పాఠశాల/జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (2/4/5శాతం), రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారికి (2/4/5శాతం), మూడేళ్లలో స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రతిభ చూపిన వారికి (5శాతం), గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న వారికి (15 శాతం) మార్కులు ఇస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 18వ తేదీ నుంచి 30 వరకు ఆయా కేంద్రాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలు వివరిస్తారు.

ఏడు కేంద్రాల్లో శిక్షణ

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్‌ఎస్, డెహ్రాడూన్, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం, శ్రీహరికోటలో ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

దరఖాస్తు విధానం ఇలా..

నాలుగు దశల్లో విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటగా ఈ-మెయిల్ ఐడీతో వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. మూడేళ్లలో వివిధ అంశాల్లో విద్యార్థి సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఉంటే, వాటి జిరాక్స్ కాపీలపై విద్యార్థి సంతకం చేసి అప్లోడ్ చేయాలి. దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 23వ తేదీ వరకూ అవకాశముంది. ఎంపిక జాబితాను రెండు విడతల్లో ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు. యువికా శిక్షణకు ఎంపికైన వారికి శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా చార్జీలు, బస, భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులు కలలను సాకారం చేసుకోవడానికి ఇది చక్కని అవకాశం. దీనిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి. ఇస్రో పేర్కొన్న అర్హతలు కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది మంచి మార్గం- **కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్, నంద్యాల**

విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం



యువికాకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. శాస్త్రవేత్తలు కావాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయుక్తం. ప్రశ్నించేతత్వమే ప్రయోగాలకు, శాస్త్రవేత్తలు కావడానికి కారణమవుతుంది.సైన్స్ టీచర్లు అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి. -**శంకర్‌ప్రసాద్, డిప్యూటీ డీఈఓ, నంద్యాల**

సర్వేలపై నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన సర్వేలపై సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని నంద్యాల డీఎల్‌డీఓ శివారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పీ4, వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేలు అన్ని మండలాల్లో వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఉయ్యాలవాడ మండలం సర్వేలో వెనుకంజలో ఉండడంతో స్థానిక ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబంలోని వ్యక్తుల జీవన ప్రమాణాలను తెలుసుకుని నిరుద్యోగ యువతీ యువకులు వారికి ఆసక్తి కలిగిన రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో పీ4 సర్వే పూర్తయిందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. మండలంలో స్పందనకు 600 అర్జీలు అందాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్జీదారుల ఇళ్ల వద్దకు సచివాలయ సిబ్బంది వెళ్లి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారన్నారు. వర్కింగ్ హోంపై కూడా సర్వే పూర్తయిందన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రుద్రవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త దీప్తి

రుద్రవరం:మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మహానంది ఉద్యానవన పరిశోధన శాస్త్రవేత్త దీప్తి రైతులకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరం బెస్త కాలనీలో మంగళవారం మామిడి తోటల్లో నాణ్యమైన దిగుబడులు సాధించడడంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల విస్తీర్ణంలో 68 శాతం మామిడి తోటలే ఉన్నాయన్నారు. కాయల పెరగుదల సమయంలో అకాల వర్షాలు రావడం వల్ల చీడ పీడల ఉధృతి అధికమై నాణ్యత తగ్గి పోతుందని చెప్పారు. మామిడి సాగులో దిగుబడి క్షీణించడానికి చెట్లు పెద్దగా అయ్యాక కొమ్మలు కత్తిరించక పోవడం, సరైన పోషకాలు అందక పోవడం, రసాయన ఎరువుల వినియోగం, సూక్ష్మ పోషకాలు లోపించడం, యాజమాన్య పద్ధతులు పాటించక పోవడం తదితర కారణాలతో పంటకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఉద్యాన వన శాఖ అధికారి శ్రీధర్, హార్టికల్చర్ అసిస్టెంట్ ఫణీంద్ర, ఉపాధి హామీ పథకం ఈసీ సుబ్బన్న తదితరులు ఉన్నారు.

మే చివరి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ హరిగోపాల్

శిరివెళ్ల: వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలు మే చివరిలోపు పూర్తి కావాలని హౌసింగ్ పీడీ హరిగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పురోగతికై ప్రభుత్వం ఎస్సీలు, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, చెంచులకు రూ లక్ష అదనపు ఆర్థిక సహాయం అందజేయనుందన్నారు. ఈ విషయాన్ని సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు . అలాగే 2025 నుంచి 2029 వరకు కొత్త ఇళ్ల మంజూరుకు అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. ఇంత వరకు 22,836 దరఖాస్తులు అందాయన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం బిల్లులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. 28, 512 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారన్నారు. వారికి రూ. 49.87 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఈ అహమ్మద్‌బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



హరినగరం వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రుద్రవరం: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. .మండల పరిధిలోని తిమ్మనపల్లె, హరినగరం గ్రామాల పరిధిలో మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ ఏఓ సునీత పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి రైతులకు పలు సూచనలు చేశారు. రోజు రోజుకు రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. అదే ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సుస్థిర దిగుబడులు వస్తాయన్నారు. పెట్టుబడి ఖర్చు కూడా తక్కువేనని చెప్పారు. అ లాగే ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబరు పొందాలని వెంటనే రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని చాలామంది రైతులు విత్తనోత్పత్తికై పంటలు పండించడం సంతోషకరమన్నా రు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారి నరేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి, విస్తరణ అధికారులు రాజు, ఫహిమా తబస్సుం తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలు శరీరానికి హానికరం



సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రుఫూస్ ఎఫైమ్

బొమ్మలసత్రం: మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు సేవించటం శరీరానికి హానికరమని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రుఫూస్ ఎఫైమ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ ఆల్కహాల్ సేవించటం వల్ల శరీరంలో పలు అవయవాలు దెబ్బతినటమే కాకుండా నరాల బలహీనత వస్తుందన్నారు. మత్తుకు బానిసైతే కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతాయన్నారు. మత్తు అలవాటు నుంచి బయటపడాలంటే సెల్: 80088 28475 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హౌస్‌సర్జన్ యామిని పూర్ణిమ, సీఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కానాల నాగమ్మ చెరువు తూముల ఎత్తివేత

- వృథాగా పోతున్న నీరు
- సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామస్తుల ఆందోళన



కానాల నాగమ్మ చెరువు



తూము ద్వారా బయటకు వెళ్తున్న చెరువు నీరు

నంద్యాల(అర్బన్): మండలంలోని మేజర్ పంచాయతీ కానాలలో ఉన్న నాగమ్మ చెరువు తూములను ఎత్తి నీటిని వృథాగా వదులుతున్నారు. చేపలు పట్టేందుకు సొసైటీ సభ్యులు కొందరు నీటిని తూముల నుంచి బయటకు పంపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కేసీ కెనాల్‌లో సాగునీరు తగ్గి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈతరుణంలో చెరువులోని నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. అయితే, చెరువులో చేపలు పట్టేందుకు అందులోని నీటిని వృథాగా వదలడం వల్ల సాగు, తాగునీటికి ఇబ్బందులు వస్తాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానాల గ్రామంలో నాగమ్మ చెరువు 856 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అంతే విస్తీర్ణంలో ఈ చెరువు కింద ఆయకట్టు ఉంది. అందులో సాగైన పంటలకు ఇప్పుడు సాగునీటి చాలా అవసరం. అయితే, చెరువులో నీటి నిల్వలు అధికంగా ఉండటంతో చేపల వేటకు అంతరాయం కలుగుతుందన్న ఉద్దేశంతో నీటిని బయటకు వదులుతున్నారు. గతంలో సంబంధిత అధికారులు నీటి వృథాను అరికట్టాలన్న లక్ష్యంతో మూడు తూములకు వెల్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆ వెల్డింగ్‌లను కొందరు తొలగించి రాత్రి సమయాల్లో తూములను ఎత్తి నీటిని వదులుతున్నారు. వదిలిన నీరు గోస్పాడు మండలం చింతకుంట్ల, పసురపాడు గ్రామాల కాల్వల వెంట వృథాగా పోతుంది. చెరువు నీరు ఆయకట్టు రైతులకు ఉపయోగపడకపోగా పక్కనున్న గ్రామాల రైతులు సైతం నీటిని వినియోగించుకోలేని పరిస్థితి. కొందరు తమ స్వలాభాల కోసం నీటిని వృథాగా వదిలేయడం సరికాదని, అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా స్వాతి మహోత్సవం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం భక్త జనసంద్రంగా మారింది. స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛాణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో ఆయా కార్యాక్రమాలు ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలకంరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవ సమాజం ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయల్, వేద పండితులు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ నిర్వహించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కానిస్టేబుల్ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు వెంటనే మెయిన్స్ నిర్వహించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్రప్రధాన కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులతో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. 2024 డిసెంబర్‌లో ఈవెంట్‌లు జరగగా మెయిన్ పరీక్షలు మాత్రం నేటికి నిర్వహించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. కానిస్టేబుల్ అభ్యర్థులు మెయిన్ ఎగ్జామ్స్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్, పట్టణ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న విద్యుత్ శాఖ కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనంతో పాటు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, దస్తగిరి, పఠాన్‌ఖాజా హుసేన్, రవికుమార్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.